సాక్షి
ఆదిలాబాద్
సోమవారం । 3 । జూన్ । 2024



నేటి నుంచి టోల్ పెంపు

జాతీయ రహదారులపై మళ్లీ టోల్‌చార్జీలు పెరిగాయి. ఈనెల 2వ తేదీ అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో మూడు టోల్‌ప్లాజాలు ఉన్నాయి. 8లో▸



పల్సి(బి)లో పానీపాట్లు 8లో▸

తలమడుగు మండలం పల్సి(బి) గ్రామస్తులకు పానీపాట్లు తప్పట్లేదు. వారం రోజులుగా భగీరథ నీరు రాకపోవడంతో సమీపంలోని బావి వద్ద వారి ఇబ్బందులు వర్ణనాతీతం.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/29.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

స్వరాష్ట్ర సాధనకు బీజేపీ విశేష కృషి



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: తెలంగాణ స్వరాష్ట్ర సాధనకు బీజేపీ విశేష కృషి చేసిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన కారణంగా రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ప్రజాపాలన అందించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర సాధనకు జాతీయస్థాయిలో అలాగే రాష్ట్రస్థాయిలో బీజేపీ నాయకత్వం, కార్యకర్తలు ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు దినేష్ మటోలియా, లాలా మున్నా, అశోక్, జోగు రవి, సునందరెడ్డి, ధోని జ్యోతి తదితరులున్నారు.

పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆదిలాబాద్‌లో ఈనెల 4న ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ బి.ప్రణయ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ నివాసం వద్ద గల ఐ లవ్‌యు ఆదిలాబాద్ సెల్ఫీ పాయింట్ నుంచి మావల పోలీసుస్టేషన్ వరకు వాహనాల రాకపోకలను దారి మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు సామాన్యులకు అనుమతి లేదని, ప్రజలంతా పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలని సూచించారు. కేఆర్‌కే కాలనీవాసులు తిరుమల పెట్రోల్ బంక్ మీదుగా ఉన్న రహదారిని వాడుకోవాలని, హ్యాండీక్యాప్ కాలనీ, ఆర్‌ఆర్ నగర్ వాసులు సరస్వతినగర్ మీదుగా ఉన్న దారుల గుండా వెళ్లాలని సూచించారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 11 వరకు కొనసాగనున్నాయి. అయితే 4వ తేదీన పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఆ రోజు పరీక్ష నిర్వహించడం లేదని డీఈవో ప్రణీత తెలిపారు. జిల్లాలో 818 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా, మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నం.1, ఉట్నూర్‌లోని తెలుగు మీడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోథ్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉన్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ గెలుపుతో బీఆర్‌ఎస్ సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి విజయం సాధించడంపై ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సంబరాలు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఎదుట టపాసులు కాల్చి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. ఇందుకు తాజా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు విజ్జగిరి నారాయణ, సుధాకర్, భూమన్న, శ్రీనివాస్, అశోక్ స్వామి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట

- సంక్షేమం, అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి
- తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో కలెక్టర్ రాజర్షి షా



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా. చిత్రంలో ఎస్పీ గౌస్ ఆలం తదితరులు



ప్రసంగిస్తున్న కలెక్టర్ రాజర్షి షా



కలెక్టరేట్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలకే పెద్దపీట వేస్తూ, ప్రజలు కోరుకున్న మార్పులకు శ్రీకారం చుట్టిందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలనలో పారదర్శకతతో పాటు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా ప్రజాస్వామిక వాతావరణాన్ని నెలకొల్పిందన్నారు. పేదలకు లబ్ధి చేకూర్చేలా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తుందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రూ.5లక్షలుగా ఉన్న పరిమితిని రూ.10లక్షలకు పెంచిందన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు ఉచిత గృహవిద్యుత్ అందించేందుకు గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేస్తుందని వివరించారు. అలాగే నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందన్నారు. సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల ఆర్థికసాయం అందిస్తోందని తెలిపారు. గూడులేని వారికి ప్రభుత్వ స్థలంతో పాటు ఆర్థిక సాయం అందజేస్తోందని ఈ పథకం కింద నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లను మంజూరు చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకిచ్చిన మాట ప్రకారం వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తుందని వెల్లడించారు. అమరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు స్వరాష్ట్ర సాధనలో భాగస్వాములైన అందరికీ ప్రణామాలు చెబుతున్నట్లుగా వెల్లడించారు. అంతకు ముందు స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్తూపం, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు కలెక్టర్, ఎస్పీలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్పీ గౌస్ ఆలం, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆర్డీవో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగంలో కనిపించని జిల్లా ప్రగతి వివరాలు

కలెక్టర్ రాజర్షి షా ప్రసంగం గతానికి భిన్నంగా సాగింది. జిల్లాకు సంబంధించిన ప్రగతి, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అంశాలవీ ప్రత్యేకంగా కనిపించలేదు. రాష్ట్రస్థాయి అంశాలతో కూడిన వివరాలనే వెల్లడించారు. వేడుకలకు హాజరైన బీజేపీ శ్రేణులతో పాటు పలువురు అధికారులు ఈ ప్రసంగంపై అక్కడే చర్చించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

అమరుల త్యాగఫలమే తెలంగాణ



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: అమరుల త్యాగ ఫలంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఆదివారం జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం సాయుధ పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణం ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, సీఐలు రమాకాంత్, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండిన.. సండే

- జిల్లాలో భానుడి భగభగ
- అర్లి(టి)లో 45.2 డిగ్రీల సెల్సియస్
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి





అర్లి(టి) గ్రామం

తాంసి: జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భీంపూర్ మండలం అర్లి(టి)లో ఆదివారం 45.2 డిగ్రీ సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా మండలాల్లోనూ 40కి పైగానే నమోదయ్యాయి. ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోత తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు తలకు రక్షణగా రుమాలు, టోపీ ధరిస్తున్నారు. ఉపశమనం కోసం శీతల పానీయాలు, నిమ్మరసం, కొబ్బరిబోండాలు తాగుతూ సేద తీరుతున్నారు.

జిల్లాలో ఆదివారం వివిధ ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు..

ప్రాంతం	నమోదైన ఉష్ణోగ్రతలు(డిగ్రీ సెల్సియస్‌లో)
అర్లి(టి)	45.2
బేల	44.5
పిప్పల్‌ధరి	44.3
నేరడిగొండ	43.7
ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు	43.7
సిరికొండ	43.5
పొచ్చెర	43.5
ఇచ్చోడ	43.0
చప్రాల	42.7
నార్నూర్	42.6
హీరాపూర్	42.6
రాంనగర్	42.5
జైనథ్	42.5
బరంపూర్	42.3
తాంసి	42.3
కలెక్టరేట్	42.2
భోరజ్	42.2
జీఎస్ఎస్టేట్	42.2
గుడిహత్నూర్	42.1
సోనాల	41.8
తలమడుగు	41.7
లోకారి	41.2
బజార్‌హత్నూర్	40.8
సాత్నాల	40.3

అందుబాటులో రైతులు కోరిన విత్తనాలు

- కలెక్టర్ రాజర్షిషా



రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా. పక్కన ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా రైతులు కోరిన డిమాండ్ రకం పత్తి విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలోని పత్తి విత్తన షాపులు, గోదాంలను ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ఆదివారం పరిశీలించారు. పలుచోట్ల క్యూలో రైతులకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, టెంట్ సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా రైతులు ఒకే రకం పత్తి విత్తనాల కోసం బారులు తీరారని, ఈ క్రమంలో వారు కోరిన విత్తనాలు తెప్పించినట్లు తెలిపారు. జిల్లాకు 27వేల ప్యాకెట్లు వచ్చాయన్నారు. మండలాల వారీగా రైతులు కొనుగోలు చేసేలా యంత్రాంగం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీంతో జిల్లా కేంద్రంలో రద్దీ తగ్గిందని తెలిపారు. విత్తన దుకాణాల వద్ద ఏఈవోలు ఉంటారని, ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. అలాగే మార్కెట్లో అనేక రకాల మేలైన పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఒకే రకంపై ఆధారపడకుండా ఇతర విత్తనాలు కూడా వేయాలని సూచించారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ డిమాండ్ రకం పత్తి విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లా యంత్రాంగంతో కలిసి పోలీసులు విత్తన దుకాణాలు, గోదాముల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారి వెంట డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

కౌంటింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ పూర్తి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కౌంటింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ఆదివారం పూర్తయింది. కౌంటింగ్ పరిశీలకులు అనిల్ కుమార్‌పాండే, హిమాన్షు కుమార్ గుప్తా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షిషా సమక్షంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రక్రియ చేపట్టారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు సంబంధించి సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈనెల 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపులో 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో టేబుల్‌కు ముగ్గురు చొప్పున అదనంగా 20 శాతం కలుపుకొని 378 ఈవీఎం కౌంటింగ్ సిబ్బంది, అలాగే పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 65 మందిని నియమించామన్నారు. 17 సీఎస్, 31 సీఏ, 13 ఎంవోల నిర్వహణపై వీరికి శిక్షణ ఇచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఈవో రవీందర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో అరవింద్ కుమార్, మూడు జిల్లాల ఈడీఎంలు తదితరులు పాల్గొన్నారు.



ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న కౌంటింగ్ పరిశీలకులు అనిల్‌కుమార్ పాండే, హిమాన్షు కుమార్ గుప్తా

పన్ను తగ్గిస్తేనే పరిశ్రమలకు మనుగడ

- పదేళ్లలో కుదేలైన పారిశ్రామిక రంగం
- మార్కెట్ ఫీజు రద్దు చేయాలి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆగ్రో ఇండస్ట్రీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజు చింతవార్



'సాక్షి'తో మాట్లాడుతున్న రాజు చింతవార్

కైలాస్‌నగర్: పరిశ్రమలు మనుగడ సాధించాలంటే పన్ను తగ్గించి రాయితీ పెంచాలి. అయితే కొన్నేళ్లుగా ప్రభుత్వాలు వీటిని పట్టించుకోవడం లేదు. విద్యుత్ బిల్లులు, ట్రేడ్ లైసెన్సులు పెనుభారంగా మారాయి. ప్రభుత్వ చేయూత కొరవడటం, మార్కెట్లో రోజురోజుకు పెరుగుతున్న పోటీతత్వం తట్టుకోలేక పరిశ్రమలను మూసివేయాల్సి వస్తుందని ఆగ్రో ఇండస్ట్రీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త రాజు చింతవార్ అన్నారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా పారిశ్రామిక రంగంలోని జిల్లా స్థితిగతులను ఆదివారం ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు.

సాక్షి: గడిచిన పదేళ్లలో జిల్లా పారిశ్రామికరంగ పరిస్థితి ఎలా ఉంది..

రాజు: వైఎస్‌ఆర్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమలకు రాయితీపై విద్యుత్, బ్యాంకు రుణాలపై పావలావడ్డీ మినహాయింపు, ట్యాక్స్‌లు తక్కువగా ఉండేవి. అయితే తెలంగాణలో అధికారం చేపట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీటిని ఐదేళ్ల పాటు మాత్రమే కొనసాగించింది. జీఎస్టీ రాకతో 2018లో సబ్సిడీ, ఇన్సెంటీవ్‌లను పూర్తిగా నిలిపివేసింది. జిల్లాకు రూ.30కోట్ల నుంచి రూ.35 కోట్ల వరకు సబ్సిడీ బకాయిలు విడుదల కావాల్సి ఉన్నాయి.

సాక్షి: జిల్లాలో జిన్నింగ్ మిల్లుల పరిస్థితి ఎలా ఉంది..

రాజు: నాలుగేళ్ల క్రితం జిల్లాలో 35 జిన్నింగ్ మిల్లులు ఉండేవి. ఇవి ఏడాదిలో ఆరు నుంచి ఎనిమిది నెలల పాటు నడిచేవి. ప్రస్తుతం ప్రభుత్వాల చేయూత కొరవడటం, పన్నులు, విద్యుత్ బిల్లుల భారం పెరగడంతో 14 మాత్రమే నడుస్తున్నాయి. అవి కూడా ఏడాదిలో 100 నుంచి 110 రోజులు మాత్రమే పని చేస్తున్నాయి. దీంతో వ్యాపారులతో పాటు వాటిపై ఆధారపడ్డ కార్మికులు నష్టపోవాల్సి వస్తుంది.

సాక్షి: జిల్లా నుంచి ఇటీవల మహారాష్ట్రకు పత్తి తరలింపు పెరిగింది. ఎందుకంటారు..?

రాజు: మహారాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ ఫీజు తీసుకోవడం లేదు. మన వద్ద మాత్రం ఒక శాతం వసూలు చేస్తున్నారు. క్వింటాలు పత్తికి రూ.8వేలతో కొనుగోలు చేస్తే ప్రభుత్వానికి రూ.80 చెల్లించాల్సి వస్తుంది. ఇది వ్యాపారులకు భారంగా మారుతుంది. మహారాష్ట్రలోని జిన్నింగ్ మిల్లులకు అక్కడి ప్రభుత్వం ఏటా ఆడిటింగ్ ముగిసిన వెంటనే సబ్సిడీలను చెల్లిస్తుంది. ఇది పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుంది.

సాక్షి: పరిశ్రమలు మూతపడటానికి కారణాలు ఏంటి..?

రాజు: బ్యాంకు రుణాలు తీసుకొని ఏర్పాటు చేసిన పరిశ్రమలకు ఏళ్లు గడిచినా సబ్సిడీ రావడం లేదు. ఇన్సెంటీవ్స్ నిలిచిపోయాయి. విద్యుత్ బిల్లులు పెరిగాయి. మన రాష్ట్రంతో పోల్చితే మహారాష్ట్రలో పెట్రోల్, డీజిల్ ధర లీటర్‌కు రూ.5 తక్కువగా ఉంది. దీంతో మార్కెట్లో పెరిగిన పోటీతత్వాన్ని తట్టుకోలేక, వడ్డీ భారం భరించలేక పరిశ్రమలను మూసేస్తున్నారు. గతంలో 10వేల మంది ఉపాధి పొందగా, ప్రస్తుతం 3 నుంచి 4వేల మందికి మాత్రమే ఉపాధి లభిస్తుంది.

సాక్షి: జిల్లాలో ఎలాంటి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయి..

రాజు: ఆదిలాబాద్ జిల్లా పత్తి సాగులో ఆసియాలో నే అగ్రస్థానంలో ఉంది. జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేస్తే 5 నుంచి 10 స్పిన్నింగ్ మిల్లులు ఏర్పాటయ్యే అవకాశం ఉంటుంది. ఒక్కో మిల్లులో 400 మంది చొప్పున 4వేల మంది వరకు ఉపాధిలభించే అవకాశం ఉంటుంది.

సాక్షి: దాల్‌మిల్, ఆయిల్ రిఫైనరీల పరిస్థితి ఏంటి?

రాజు: గతంలో జిల్లాలో మూడు దాల్ మిల్లులు ఉండగా రెండు మూతపడ్డాయి. ప్రస్తుతం ఒకటే నడుస్తుంది. ఆయిల్ రిఫైనరీలు గతంలో నాలుగు ఉండగా, రెండు మూతపడ్డాయి. ప్రభుత్వాల నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందకపోవడం, పన్నుల భారం పెరగడమే ఇందుకు కారణం.

సాక్షి: జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి మీరిచ్చే సూచనలు..

రాజు: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు మంచి అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ భూములు లభ్యమవుతాయి. నీటి వసతితో పాటు జాతీయ రహదారి సౌకర్యం అందుబాటులో ఉంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ – నాగ్‌పూర్ ఇండస్ట్రీయల్ కారిడార్‌ను ప్రకటించినప్పటికీ ఒక్క పరిశ్రమను ఏర్పాటు చేయలేదు. జిల్లాలో ఇంద్రవెల్లి, గుడిహత్నూర్ ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో టమాట పంట సాగవుతుంది. అక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయవచ్చు. జిల్లాలో ఒక్క కోల్డ్ స్టోరేజ్ కూడా లేకపోవడం రైతులకు నష్టాన్ని కలిగిస్తుంది. వాటిని ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుంది.

క్లుప్తంగా

ఎమ్మెల్యే, కార్యకర్త మధ్య ఆడియో సంభాషణ వైరల్

భైంసాటౌన్: ఎమ్మెల్యే రామారావుపటేల్, ముధోల్ మండలానికి చెందిన బీజేపీ కార్యకర్తతో జరిగిన సంభాషణ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 1.25 నిమిషాలు ఉన్న ఆడియోలో సదరు కార్యకర్త పార్టీ కోసం పనిచేసినా తమను పట్టించుకోవడం లేదని పేర్కొనగా, నీ ఒక్కడి ఓటుతోనే గెలవలేదంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఉంది. ఈ విషయమై ఎమ్మెల్యేను ఫోన్‌లో వివరణ కోరగా, దురుద్దేశంతోనే వైరల్ చేశారని, పూర్తి వివరాలు పరిశీలించిన తర్వాత స్పందిస్తానన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భైంసారూరల్: మండలంలోని హజ్గుల్ సమీపంలోని వాగు వద్ద పేకాటస్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. పక్కా సమాచారంతో దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.15,390 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

లైన్‌మెన్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న కిరణ్‌కుమార్

బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన విద్యుత్ లైన్‌మెన్ ఎరెడ్ల కిరణ్‌కుమార్‌కు ఉత్తమ ఉద్యోగి అవార్డు లభించింది. ఆదివారం ఆయనకు వరంగల్‌లో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి ఈ అవార్డును అందించారు. విధులు బాధ్యతాయుతంగా నిర్వహించినందుకు ఈ అవార్డు రావడంపై కిరణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

జొన్న లేపాకులు తిని 9 ఆవులు మృతి



మృతిచెందిన ఆవులు

నార్నూర్: మండలంలోని సుంగాపూర్ శివారులోని పొలంలో జొన్న లేపాకులు తిని 9 ఆవులు ఆదివారం మృతిచెందాయి. వివరా లు ఇలా ఉన్నాయి. రైతులు మొత్తం 20కి పై గా ఆవులు ఉదయం 9 గంటలకు మేత కో సం వదిలారు. అవి జొన్న లేపాకులు తిన్నా యి. అరగంట తర్వాత ఒక్కో ఆవు మృతి చెందడంతో గమనించిన గ్రామస్తులు వెంటనే పశువైద్యాధికారి రాథోడ్ రమేశ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన వెంటనే సిబ్బందిని సంఘటన స్థలానికి పంపి వైద్యం అందించారు. అప్పటికే 9 ఆవులు మృతి చెందాయి. అనంతరం పంచనామా నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించాలని బాధితులు జాదవ్ ప్రేంసింగ్, భీంరావు, మానిక్‌రావు, దేవిదాస్, రాథోడ్ గణేశ్, రాజిబాయి, కృష్ణ, రాజేశ్ కోరుతున్నారు.

జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



ఎంపీడీవో కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ జైవంరరావు



వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ, తదితరులు



ఐటీడీఏలో ఆవిర్భావ వేడుకలు

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా జాతీయ జెండాను ఎగురవేశారు. అంతకుముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మహనీయుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీవో భీంరావు, ఏవో రాంబాబు, ఈఈ భీంరావు, ఆర్సీఓ గంగాధర్, ఐటీడీఏ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీపీ జైవంరరావు జెండావిష్కరించారు. అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేశారు. పాత బస్టాండ్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ జాతీయ జెండా ఎగురవేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యుం, ఎక్బాల్, రాజమణి, నాయకులు అజీం, నిసార్, రాధాబాయి, జుబేర్, మాబూద్, స్వామి, ఫయీం, రాజేశ్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

- వ్యాయామానికి వినియోగం
- మధుమేహం నియంత్రణ, ఒత్తిడి దూరం



సైక్లింగ్ క్లబ్ సభ్యుల బృందం (ఫైల్)



నిర్మల్‌లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవ నిర్వహణ (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: మూడు దశాబ్దాల క్రితం వరకు ఇళ్లలో సైకిల్‌ను వినియోగించేవారు. విద్యార్థులు, ఉద్యోగుల్లో చాలామంది సైకిళ్లపై బయటకు వెళ్లేవారు. ప్రస్తుత కాలంలో సైకిళ్ల వాడకం బాగా తగ్గిపోయింది. బైక్‌లు, కార్ల వాడకం పెరిగిపోయింది. ఈరోజుల్లో చాలామంది వ్యాయామ సాధనాలు, బరువు తగ్గడం, తదితర వాటికి సైకిల్‌ను ఉపయోగిస్తున్నారు. మరోవైపు సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇంతటి ప్రాముఖ్యత ఉండడాన్ని గుర్తించి ఐక్యరాజ్యసమితి జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్సవంగా ప్రకటించింది. ఈ సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

సైకిల్ ప్రాధాన్యత తెలిపేలా..

జిల్లా కేంద్రానికి చెందిన వైద్యులు బీఎల్ఎన్ రెడ్డి, రామకృష్ణ, రఘునందన్ రెడ్డి తదితరులతో కూడిన బృందం సైకిల్ ప్రాధాన్యతను తెలియజేస్తున్నారు. క్రియాశీలక సభ్యులతో సైక్లింగ్ క్లబ్ ఏర్పాటు చేశారు. ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి పొలజీ గణేశ్ ఆలయానికి 75 కి.మీ, నిర్మల్ నుంచి ఆదిలాబాద్ జిల్లా జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శివరాత్రి జాగరణకు సైకిల్‌పై 200 కి.మీ యాత్ర చేపట్టారు. కాల్వ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి సైకిల్ రైడ్, గాంధీ జయంతిని పురస్కరించుకొని 305 కి.మీ, అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాంజీగోండ్ సైకిల్ యాత్ర వంటివి చేపట్టారు. పర్యావరణ దినోత్సవ సైకిల్ ర్యాలీ లాంటివి చేపడుతూ సైక్లింగ్ ప్రాధాన్యతను తెలియజేస్తున్నారు.

నేడు సైకిల్‌యాత్ర

ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో 20 కి.మీ సైకిల్ యాత్ర నిర్వహించనున్నట్లు క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 5:30 గంటలకు శివాజీ చౌక్ నుంచి సైకిల్ యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొంటారని వివరించారు.

సైకిలింగ్ ద్వారా ప్రయోజనాలు..

- రోజుకు కనీసం గంట నుంచి 2 గంటల వరకు సైకిల్ తొక్కడం వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- మధుమేహం నియంత్రణ, ఒత్తిడిని తగ్గిస్తుంది. అదేవిధంగా బరువు తగ్గడం, కొలెస్ట్రాల్‌ను తగ్గించడంతోపాటు గుండె పోటు, కొన్ని క్యాన్సర్లు, డిప్రెషన్, మధుమేహం ఊబకాయం, కీళ్లనొప్పులు తీవ్ర వ్యాధుల నుంచి రక్షించడంలో సైక్లింగ్ సహాయపడుతుంది. సైకిల్ తొక్కడం వల్ల కాళ్లలో బలం పెరుగుతుంది.
- సైక్లింగ్‌తో ఆరోగ్యం. అన్ని వయసుల వారికి అనుకూల వ్యాయామం. సైకిల్ ద్వారా దుకాణాలు, పార్క్, పాఠశాల లేదా కార్యాలయానికి వెళ్లడం ద్వారా మీ జీవనశైలిలో భాగం చేసుకోవచ్చు.

సైక్లింగ్ చేస్తున్నా



నిర్మల్‌లో ప్రభుత్వ పాఠశాలలో చదివేవాడిని. గ్రామం నుంచి పట్టణానికి, ఇంటర్ స్థాయి వరకు సైకిల్‌పై వచ్చి చదువుకున్నాను. రెండు దశాబ్దాలకు పైగా సైకిల్ వినియోగించాను. సైకిల్ వినియోగం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. ఉదయం సైక్లింగ్ చేస్తుంటాను.

– కొండూరు నరేశ్, లంగ్డాపూర్

గాలికి తెగిన జెండా



కడెం: రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా మండలంలోని పెద్దబెల్లాల్ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేకాధికారి రాజశేఖర్‌గౌడ్ ఆదివారం జాతీయ జెండాను ఎగురవేశారు. సాయంత్రం ఈదురుగాలులకు జెండా తాడు తెగి పక్కన ఉన్న చెట్టుపై పడింది. గమనించిన సిబ్బంది జెండాను కిందకు దించారు.

నేటి నుంచి టోల్ పెంపు

- ఉమ్మడి జిల్లాలో మూడు టోల్‌ప్లాజాలు
- ఇక వాహనదారులకు 1 నుంచి 5శాతం పెరిగిన టోల్



రోల్‌మామడ టోల్‌ప్లాజా

నేరడిగొండ: దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై మళ్లీ టోల్‌చార్జీలు పెరిగాయి. ఏటా ఏప్రిల్ 1 నుంచి పెంచే ఈ చార్జీలు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేయాలని ఎన్‌హెచ్ఏఐని ఈసీ ఆదేశించింది. చివరి విడత ఎన్నికలు ముగిసిన అనంతరం పెరిగిన చార్జీలు ఈనెల 2వ తేదీ అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. అయితే నేషనల్ హైవే 44 జాతీయ రహదారిపై ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని జైనథ్ మండలం పిప్పర్‌వాడ, నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ, నిర్మల్ జిల్లాలోని గంజాల్ టోల్‌ప్లాజాలు ఉన్నాయి. వీటి వద్ద నుంచి పెద్ద ఎత్తున వాహనాలు వెళ్తుంటాయి. కశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు వెళ్లే ఈ రహదారిపై వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద ప్రతీరోజు 6వేల నుంచి 7వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద 5వేల నుంచి 6వేల వరకు, గంజాల్ టోల్‌ప్లాజా వద్ద 8వేల నుంచి 10వేల వరకు వాహనాలు వెళ్తుంటాయి.

తాజాగా పెరిగిన టోల్‌చార్జీలు ఇలా..

కార్లు, జీపులు, వ్యాన్‌లకు రెండు వైపులా ప్రయాణానికి రూ.5, చిన్న లారీ, పది టైర్ల లారీలకు రూ.10 పెరిగాయి. వాణిజ్య భారీ గూడ్స్ లారీలకు రూ.15 పెరిగాయి. మొత్తం 5 శాతం మేర టోల్ చార్జీలు పెంచినట్లు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా తెలిపింది.


కలప స్మగ్లర్ల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎఫ్‌వో

ఇచ్చోడ: టైగర్‌జోన్ అటవీపరిధిలోని సిరికొండ సెక్షన్ 189 కంపార్ట్‌లో కలప స్మగ్లర్లను శనివారం రాత్రి పట్టుకున్నట్లు డీఎఫ్‌వో ప్రశాంత భాజీరావు పాటిల్ తెలిపారు. మండలంలోని కలప డిపోలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. అటవీశాఖకు చెందిన ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో సిరికొండ అటవీప్రాంతంలో సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. సాత్‌మోరి బీట్‌లో కలప దుంగలను నరుకుతున్న నలుగురిని గుర్తించారు. అటవీ అధికారులను చూసి ఇద్దరు పరారీ అయ్యారు. మరో ఇద్దరిని అదుపులో తీసుకుని కలపతోపాటు వారి వద్ద నుంచి రూ.39,700 విలువ గల మోటార్ బైక్, ఎడ్లబండిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్‌వో తెలిపారు. స్మగ్లర్లను కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఇచ్చోడ టైగర్‌జోన్ అటవీఅధికారి గణేశ్, డిప్యూటీ రేంజ్ అధికారి అమర్‌సింగ్, ఎఫ్‌బీవో బాగుబాయి, సిబ్బంది ఉన్నారు.

పల్సి(బి)లో పానీపాట్లు



అడుగంటిన బావిలో నుంచి నీటిని తాడుతో తీస్తున్న గ్రామస్తులు



తలమడుగు: మండలంలోని పల్సి(బి) గ్రామస్తులకు పానీపాట్లు తప్పడం లేదు. గ్రామంలో వారం రోజులుగా భగీరథ నీరు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. మొత్తం 100 కుటుంబాలు ఉన్నాయి. ఆదివారం ఉదయం 5 గంటలకు గ్రామస్తులు అర కిలోమీటర్ కాలినడకన గ్రామ సమీపంలోని బావి వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకున్నారు. పది బకెట్లు నీటిని తోడాక అడుగంటడం, మళ్లీ ఊరేదాక గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడ్డ కుర్ర నందకిశోర్, బొట్టు వంశీ

కుంటాల: మండలంలోని కల్లూర్–కుంటాల రహదారిపై అందాకూర్ చెరువు చివరికట్ట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..నిర్మల్ పట్టణంలోని కావేరి జనరల్ స్టోర్ యజమాని కుర్ర నందకిశోర్ తన మిత్రుడు భాగ్యనగర్‌కు చెందిన బొట్టు వంశీతో కలిసి పని నిమిత్తం మండలంలోని అంబకంటి, కుంటాలకు బైక్‌పై ఆదివారం వచ్చారు. తిరుగు ప్రయాణంలో అందాకూర్ చెరువు కట్ట మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పడంతో ఇరువురికి గాయాలయ్యాయి. అటుగుండా వస్తున్న కానిస్టేబుల్ రంజిత్ కుమార్ గమనించి గాయాలైన వంశీని కారులో ఎక్కించారు. స్థానికులు నందకిశోర్‌ను 108లో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్‌కు పంపించారు. ఘటనా స్థలి నుంచి బైక్‌ను కానిస్టేబుల్ రంజిత్ కుమార్ బయటకు తీసుకువచ్చి క్షతగాత్రులకు సపర్యలు చేశారు. ఆయనను పలువురు అభినందించారు.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. లక్ష్మణచాంద నుంచి ధర్మారం వెళ్లేదారిలో కోతి దేవుని ఆలయం సమీపంలో మూలమలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లక్ష్మణచాందకు చెందిన గంగాధర్, పెద్దులకు గాయాలయ్యాయి. 108 సిబ్బంది వారిని నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు.

వరికుచ్చులను మెచ్చుకున్న సీఎం

నిర్మల్: తెలంగాణ దశాబ్ది వేడుకల్లో జిల్లా నుంచి ప్రదర్శనలో ఉన్న ధాన్యపు కుచ్చులు ప్రత్యేక ఆకర్షణగా నిలువడమే కాకుండా.. సీఎం రేవంత్‌రెడ్డి సహా ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఆదివారం సాయంత్రం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వీటిని ప్రదర్శించారు. జిల్లాకు చెందిన డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీఆర్‌డీపీ, సెర్ప్ సిబ్బంది కలిసి వరికుచ్చులను ప్రత్యేకంగా తయారు చేశారు. చేనేత, ఇతర కళాకృతుల కంటే ఈసారి ధాన్యపుసిరిని కళ్లకు కట్టించే వరికుచ్చులు అందరినీ ఆకట్టుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈఓ, కమిషనర్ అనితా రామచంద్రన్, సంగీత దర్శకుడు కీరవాణి పరిశీలించారు.



వరికుచ్చులను సందర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, తదితరులు

వడదెబ్బతో వృద్ధుడి మృతి

ఆదిలాబాద్‌రూరల్: వడదెబ్బతో వృద్ధుడి మృతిచెందాడు. స్థానికుల, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన నడిపెల్‌వార్ విష్ణు (65) కొన్ని నెలలుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నారు. ఈ క్రమంలో బేల్లూరి శివారు ప్రాంతానికి వెళ్లగా ఆదివారం వడదెబ్బ తగలి మృతిచెందారు. అటు వైపు ప్రజలు గమనించి డయల్ 100కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఆదిలాబాద్ రూరల్ పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలిపారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తీసుకెళ్లారు.

జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య

ఖానాపూర్: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలోని నడింపల్లె గ్రామానికి చెందిన చిప్ప సతీశ్(35) జులాయిగా తిరుగుతుండేవాడు. మద్యానికి బానసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. తల్లి వెంకవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూహౌజింగ్ బోర్డు కాలనీలో గల సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. ఆలయంలోని హుండీని పగులగొట్టి అందులో రూ.4 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఆలయ పూజారి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీకి విఫలయత్నం



పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి చోరీకి విఫలయత్నం చేశారు. పూజారి నరేశ్ శర్మ, భక్తులతో కలిసి ఆదివారం ఉదయం పూజా కార్యక్రమాల కోసం ఆలయానికి వెళ్లారు. ప్రధాన ద్వారం తలుపు తెరవడం, తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుమాంజలి అక్కడి చేరుకుని పరిసరాలు పరిశీలించి క్లూస్‌టీంను రప్పించారు. ఫింగర్ ప్రింట్ అధికారి బాలాజీ, మహేశ్, డాగ్‌స్క్వాడ్ మహిపాల్, డాగ్ హంటర్‌తో పరిశీలించారు. పూజారి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.